క్లుప్తంగా

అంబలి కేంద్రం దాతకు సన్మానం



మరికల్: అయ్యప్ప స్వామి సేవా సమితి ద్వారా 22 ఏళ్ల పాటు వేసవిలో బాటసారుల దాహార్తిని తీరుస్తున్న అంబలి కేంద్రం దాత కప్పె సతీష్‌కుమార్‌ను శుక్రవారం యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, గ్రామస్తుల దాహం తీర్చడం కోసం తన సొంత ఖర్చులతో అంబలి కేంద్రాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామన్నారు. ప్రకాశ్, రవి, రఘు, రవిప్రకాష్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఊట్కూరు: నిడుగుర్తి గ్రామానికి చెందిన కుర్వ లక్ష్మికి రూ.14 వేలు, ఊట్కూరుకు చెందిన జరీనాబేగం కు రూ.20 వేలు, పెద్దపొర్లకు చెందిన మాణిక్యమ్మకు రూ.27 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, కృష్ణార్జున్‌రెడ్డి, గజ్జలప్ప, కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోషమ్మ బోనాలు



కొత్తపల్లి: మండలంలోని వీరారం గ్రామంలో పోషమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ శివారులో వెలిసిన పోషమ్మకు నైవేద్యంగా సమర్పించారు. కోళ్లు కోసి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ శిక్షణ శిబిరం



ధన్వాడ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నెట్‌బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసిందని నిర్వాహకులు డాక్టర్ రామ్మోహన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో బాలబాలికలు పాల్గొని, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రవికుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే మనుగడ



అమరచింత: మొక్కలను సంరక్షించడం ద్వారానే స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ లభిస్తాయని అప్పుడే మానవ మనుగడతో పాటు జీవ వైవిధ్యానికి ఎలాంటి హాని ఉండదని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం పట్టణంలో పచ్చదనంపై ర్యాలీ నిర్వహించి మొక్కల సంరక్షణతో కలిగే ప్రయోజనాలు వివరించారు. వర్షాలు కురుస్తుండటంతో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని కోరారు.

ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా శశిధర్

అమరచింత: ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ అమరచింత ఇన్‌చార్జి కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు మున్సిపల్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం వంద రోజుల ప్రణాళికతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు. ఏదైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య



కాన్‌కుర్తిలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్: సర్కార్ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా నాణ్యమైన విద్యతో పాటు ఉచిత నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర వసతులు అందుతాయన్నారు.

- మాగనూర్ మండల కేంద్రంతో పాటు వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురురాజరావు తదితరులు పాల్గొన్నారు.
- మరికల్, పెద్దచింతకుంట గ్రామాల్లో ఎంఈఓ మనోరంజని ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ ప్రారంభించారు.
- దామరగిద్ద మండలంలోని కాన్‌కుర్తి, అన్నసాగర్, దామరగిద్ద, మొగుల్‌మడ్క, క్యాతన్‌పల్లి తదితర అన్ని పాఠశాలల్లో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృష్ణారెడ్డి, విశ్వనాథ్, ఉషేనప్ప, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపల్లి మండలంలోని నిడ్జింత, కొత్తపల్లిలో ఎంపీడీఓ కృష్ణారావు, నిడ్జింతలో మండల విద్యాధికారి ఆంజనేయులు, ఎంపీఓ రామన్నతో కలిసి గ్రామసభ నిర్వహించారు.
- ధన్వాడ ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని గోటూర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందంతో పాటు పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



గోటూర్‌లో..



కొత్తపల్లి మండల కేంద్రంలో..



పెద్దచింతకుంటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ



మాగనూర్ పాఠశాలలో..

ప్రకృతి ఆధారిత వ్యవసాయంతో ప్రయోజనం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

దామరగిద్ద: సేంద్రియ పద్ధతులను అవలంబిస్తూ ప్రకృతి ఆధారిత వ్యవసాయం ద్వారా అధిక ప్రయోజనం పొందవచ్చని ఏఎంఓ మణిచందర్, ఏఈఓ గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని వత్తుగుండ్ల పంచాయతీ ఆవరణలో సేంద్రియ సాగు పద్ధతులు, పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో చిరుధాన్యాల సాగు అధికంగా ఉండటంతో నేషనల్ మిషన్ ఫర్ న్యాచురల్ ఫార్మింగ్ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 125 మంది జొన్న సాగు చేపట్టే రైతులను ఎంపిక చేసి వారి పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తున్నామన్నారు. మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా పోషక లోపాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం అధికం కావడంతో పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు తగ్గడంతో వ్యవసాయంపై మొగ్గుచూపడం లేదన్నారు. తక్కువ పెట్టుబడితో జీవామృతం, నీమాస్త్రం, వంటి పలు రకాల కషాయాలతో పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం, పశుపోషణ, సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరిగి నాణ్యమైన పంటలను పొందవచ్చని తెలిపారు.

పాఠశాలల ప్రారంభం నాటికే యూనిఫాంలు



నర్వ: పాఠశాలల ప్రారంభం నాటికి మండలంలోని అన్ని ప్రభుత్వ బడుల విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ అందజేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు దుస్తులను ఏపీఎంతో కలిసి పంపిణీ చేశారు. పాఠశాలలు ప్రారంభం నాటికి ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్కులు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ఏపీఎం, సీసీలు, కల్వాల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహ్మద్‌బషీర్, సీఆర్పీ నర్సిములు, ఐఈఆర్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

కోస్గి రూరల్: నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 15, 16 న జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయకార్యదర్శి ఎదిరింటి నర్సిములు అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా విక్రయించొద్దని డిమాండ్ చేశారు. మహాసభలకు గ్రామ పంచాయతీ, మిషన్‌భగీరథ, ఆటో, రైస్‌మిల్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మధ్యాహ్నభోజన కార్మికులు, భవననిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, వెంకటయ్య, మొగులయ్య, కృష్ణయ్య, తిరుమలయ్య, పార్వతీరెడ్డి, కొండప్ప తదితరులు ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎదిరింటి నర్సిములు

బీటీ రోడ్డుకు భూమిపూజ



కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత నుంచి దోరేపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.13.34 కోట్లు మంజూరు కాగా.. రోడ్డు నిర్మాణానికి శుక్రవారం డీఈ విలోక్, ఏఈ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లు బాగుంటే రవాణా వ్యవస్థ మెరుగుపడి అభివృద్ధికి పునాదులు పడతాయనే లక్ష్యంతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

నారాయణపేట ఎడ్యుకేషన్: బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా విద్యాశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆడపిల్లలు కేవలం చదువుపైనే కాకుండా అన్ని రంగాల్లో రాణించి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. పాఠశాలలో చదువుతో పాటు మానవత, నైతిక, సాంఘీక విలువలు నేర్పించాలని సూచించారు. మైనర్లకు వ్యక్తిగత పరిశుభ్రత, శరీర పెరుగుదల మార్పులు దాని పర్యావసనాల గురించి వివరించాలని, బాల్య వివాహాలను నిరోధించాలని, లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు మొదలైన వాటి గురించి ఉపాధ్యాయులు వివరించాలన్నారు. చదువులో ప్రతిభ కనబర్చిన వారికి తగిన పోత్సాహక బహుమతులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ నర్మద, ప్రజ్వల్ స్టేట్ కో ఆర్డినేటర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మద్దూరు: అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్న ఘటన మద్దూరు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు పట్టణంలోని జె రాజు కిరాణంలో తనిఖీలు నిర్వహించగా 15 బస్తాల్లో దాదాపు 750 కిలోల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని తెలిపారు. ఈ బియ్యంను పట్టణంలోని సంజీవరెడ్డి డీలర్ షాపులో అప్పగించామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన రాజుపై పోలీసులు 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



గుండుమాల్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ భాస్కరస్వామి



కల్వాల్‌లో

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని కోస్గి, గుండుమాల్ మండల తహసీల్దార్లు బక్క శ్రీనివాసులు, భాస్కర స్వామి అన్నారు. శుక్రవారం కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేట్, ముక్తిపాడ్ గ్రామాల్లో సదస్సు నిర్వహించగా ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. గుండుమాల్ మండలంలోని సారంగరావుపల్లిలో 5 ఫిర్యాదులు అందాయని తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకట్రాములు, సీనియర్ అసిస్టెంట్ రామేశ్వరమ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్, మహేష్, స్వాతి, జ్యోతి, పాండు తదితరులు ఉన్నారు.

నర్వ: భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడుతాయని తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దకడ్మూర్, కల్వాల్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, ఆర్‌ఐలు మల్లేష్, ఆశ, సిబ్బంది బాలరాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

దామరగిద్ద: తెలంగాణ ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కోసం 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ జీఎచ్‌ఎం అశోక్‌కుమార్, కోఆర్డినేటర్ శంభులింగ్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 94903 22492 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇంటర్ అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం

మాగనూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం విద్యార్థుల అడ్మిషన్ల గురించి మాగనూర్, కొత్తపల్లి, కున్సి, ముడుమాల్, గుడేబల్లూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. 'మీ భవిష్యత్‌కు భరోసా మాది' అంటూ అధ్యాపక బృందం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగహన కల్పించారు. కళాశాలలో సీఈసీ, బైపీసీ తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని సీనియర్ అధ్యాపకుడు గుండెరావు తెలిపారు. విద్యార్థులకు ఉచిత విద్య, పుస్తకాలు, అడ్మిషన్ ఫీజు ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామస్వామి, ప్రదీప్, సుదర్శన్‌రెడ్డి, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కోస్గి రూరల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు, గుండుమాల్ ఎంపీడీఓ వేణుగోపాల్ అన్నారు. కోస్గి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో, గుండుమాల్ మండలంలోని వీరారం, కొమ్మూర్, అప్పాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ, ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడతల వారీగా నిధులు మంజూరవుతాయని తెలిపారు. నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గుండుమాల్ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తడుం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కిసాన్ క్రెడిట్ కార్డ్‌పై అవగాహన

ధన్వాడ: మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సంఘంలో శుక్రవారం కిసాన్ క్రెడిట్ కార్డ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రహ్మాన్ మాట్లాడుతూ బ్యాంకులు మత్స్యకార్మికులకు ఇచ్చే కిసాన్ క్రెడిట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, అటల్ పింఛన్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీయం విజయ్, మత్స్యపారిశ్రామిక సహకర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములు నాయుడు, సందబాల నరసింహులు, గుండ్లకుంట నరసింహులు, వెంకటయ్య, శివరాములు, నారాయణ, కతలప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రహ్మాన్

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు

మక్తల్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం పున:ప్రారంభించడంతో పాటు గణపతి, గరుత్మంతుడు, శ్రీకృష్ణుడు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను పురస్కరించుకొని విగ్రహాలను ఆంజనేయస్వామి ఆలయం నుంచి ట్రాక్టర్‌పై ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన దాండియా నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీహరి, లలిత దంపతులు, డాక్టర్ రాము, కర్నిస్వామి, కోళ్ల వెంకటేష్, తిరుపతి, నర్సిములు, కిష్టప్ప, అంజనేయులు, శ్రీహరి, చంద్రశేఖర్, నీలప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

డాక్టర్ రాంబాబు మృతి వైద్య రంగానికి లోటు

నారాయణపేట: డాక్టర్ రాంబాబు మరణం వైద్య రంగానికి తీరని లోటని, సమాజానికి, వైద్య రంగానికి ఆయన అందించిన సేవలు మరవలేనివని పేట డాక్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ్ చాలక్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శాసన్‌పల్లిరోడ్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ రాంబాబు సంస్మరణ సభను పేట డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ జయచంద్రమోహన్, వైద్యులు విశ్వనాథ్, మల్లికార్జున్, నవీన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రాంబాబు చిత్రటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

అన్నదాత ఆగమాగం..!



ఉంద్యాలలో పత్తి మొలకలకు ట్రాక్టర్ ద్వారా నీటిని అందిస్తున్న రైతు

- ముందుగా పత్తి విత్తనాలు విత్తిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- వర్షాలు లేక ఎండుతున్న మొలకలు
- మరికొన్ని చోట్ల భూమిలోనే విత్తనం
- ముందస్తు వర్షాలు నట్టేట ముంచాయని రైతుల ఆందోళన

చిన్నచింతకుంట: రోహిణి కార్తెలో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. అయితే ఈ సంవత్సరం ముందుగానే నైరుతి రుతుపవనాల రాకతో మే నెలాఖరులోనే తొలకరి పలకరించింది. వారం రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు ఉత్సాహంగా దుక్కులు దున్ని.. రోహిణి కార్తెలోనే పత్తి విత్తనాలు విత్తారు. ఆ తర్వాత వరుణుడు మొహం చాటేయడంతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. వ్యయప్రయసాలకోర్చి సాగుచేసిన పత్తిపంట వర్షాలు లేక ఎండిపోతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

మొలకలను కాపాడుకునేందుకు పాట్లు..

చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల, అమ్మాపూర్, గూడూర్, కురుమూర్తి తదితర గ్రామాల్లో దాదాపు 60 శాతం రైతులు ముందుగా కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు నాటుకున్నారు. అయితే వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తి మొలకలు వాడుపట్టి ఎండిపోతున్నాయి. కొన్ని విత్తనాలు మట్టిలోనే ఉండి మొలకెత్తని పరిస్థితులు నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు వర్షాల కోసం వెయ్యి కోళ్లతో ఎదురుచూస్తున్నారు. మరికొందరు రైతులు ఎలాగైనా మొలకెత్తిన పత్తి మొలకలను బతికించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. బోరుబావులు లేని రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి పంట పొలానికి తడి అందించాల్సిన దుస్థితి నెలకొంది.

7వేల ఎకరాల్లో సాగు..

మండలవ్యాప్తంగా ఈ ఏడాది 14,500 ఎకరాల్లో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. అయితే గతనెలలో కురిసిన వర్షాలకు దాదాపు 7వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఎకరా సాగుకు రూ. 10వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. తీరా పత్తి విత్తనాలు వేశాక వర్షాలు లేకుండా పోవడంతో రైతుల కష్టం నేలపాలైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదెకరాల్లో విత్తనాలు వేశా..



ముందుగా వర్షాలు కురుస్తున్నాయని ఐదెకరాల్లో పత్తి విత్తనాలు వేశా. పత్తి మొలకలు బాగానే వచ్చాయి. కాని గత వారం రోజులుగా వర్షం కురువక పోవడంతో మొక్కలు వాడుపట్టి ఎండిపోతున్నాయి. వర్షం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నా. వరుణ దేవుడు రైతులపై కనికరం చూపాలి. – రవి, రైతు, ఉంద్యాల

తొందరపడొద్దు..



రోహిణి కార్తెలో విత్తనాలు నాటుకుంటే మంచిదే. మంచి దిగుబడి వస్తుంది. కాని విత్తనాలు నాటుకునేంతగా అనువైన వాతావరణం ఏర్పడలేదు. విత్తనాలు నాటేందుకు దాదాపు 60 ఎం.ఎం. వర్షపాతం ఉండాలి. మండలంలో 4.8 ఎం.ఎం. వర్షం మాత్రమే కురిసింది. రైతులు తొందరపడి విత్తనాలు నాటుకున్నారు. – రాజేష్ ఖన్నా, ఏఓ, చిన్నచింతకుంట